



3నుక ఎవరో నెమిళ్ళపాడుకు రెండి య్యి అనడం వినబడింది. నెమిళ్ళ పాడు పేరు వినడంతోటే శేషగిరి గుర్తుకొచ్చాడు. ఆయనతో నాకు సరిగ్గా సంవత్సరం అనుబంధముంది. ఆత్మకూరులో ఉండగా నేనో ప్రైవేట్ స్కూల్లో పనిచేసేవాణ్ణి. ఆ సంవత్సరంలో ఏం సంపాదించాను? అనే ఆలోచన వస్తే ఇప్పటికీ టక్కున చెప్పే యగలను శేషగిరి స్నేహం అని. అసలు మా పరిచయం చాలా విచిత్రంగా పెరిగి పెద్దదయింది. అదేనా మిగతా మిత్రులయితే మా అనుబంధాన్ని చోద్యంగా ఉందంటారు. దానికీ రీజన్ లేకపోలేదు. శేషగిరి బి. ఎ. చదివాడు. అయినా అలా కనబడడు. చాలా నెమ్మదస్తుడు. ఎంతంటే ఒక్కసారి నాకే చికాకేసేంత నెమ్మదితనం. దానికితోడు అదేం మనిషోగాని, ఇప్పటికీ అచ్చం పల్లెటూరి వాడిలాగే ఉంటాడు. మొట్టమొదట స్కూల్లో కనబడితే హల్లో....అని పలకరించి వెళ్ళిపోయే వాణ్ణి. మిగతా టీచర్లయితే తమకు నవ్వొచ్చి ఆనందం కలిగేలా శేషగిరి గురించి ఆయన లేనప్పుడు మాట్లాడుకొనేవాళ్ళు. ఒక్కోసారి నేనూ వాళ్ళతో కలిసిపోయేవాణ్ణి.

రోజుకు ఆరుగంటలపైగా కలసి ఉండటం మూలాన్నేమో శేషగిరితో కాస్త పరిచయం పెరిగింది. నేను కాలక్షేపానికని చేతబట్టుకు పోయే పుస్తకాల్ని తీరికటైంలో ఇప్పించుకొని చదివేవాడు. తిరిగి ఇచ్చేటప్పుడు మర్యాదకని చదివారా? అనో లేక ఎలాగుంది? అనో అడిగేవాణ్ణి. దానిమీద శేషగిరి నెమ్మదిగా నాలుగు మాటలు చెప్పేవాడు. మొదట





# విప్పుకొమ్మల నడుమ చిగురుటాకులు

పినాకపాణి

పట్టించుకోకున్నా ఆ మాటల్లో ఉండే ప్రత్యేకతేదో నన్ను ఆవరించేసింది..

ఇక అక్కడి నుండి మొదలైంద మా స్నేహం. ఎలా పెరిగిందో ఎన్ని మలుపులు తిరిగిందోగాని బలపడింది. నేను ఎక్కువ ఇష్టపడింది పైకి మొరటుగా ఉన్నా అతని మనసులోని మృదుత్వాన్ని మాట నెమ్మదిగా ఉన్నా అందులోని సూటిదనాన్ని. నెమ్మదిగా నా స్నేహితుల్లో కలిసిపోయాడు. అయినా నాలాగా ఎవరికీ దగ్గరకాలేదు.

సరిగ్గా ఆ సంవత్సరంలో మేం దూరమై పోయాం.

ఆమాటకొస్తే నేనే మా ఊరికి దూరమయ్యాను. అతనూ తన సొంత ఊరికి వెళ్ళడని తెలిసింది. ఇప్పటిదాకా మా ఇద్దరిమధ్యా కలుసుకోవడాలు, ఉత్తరాలు రాసుకోవడాలు ఏమీలేవు.

అయినా నెమిళ్ళపాడు అనగానే చప్పున గుర్తొచ్చాడు.

ఆ వూరు రోడ్డుమీదనే ఉంది. మళ్ళీ ఈ వైపు ఎప్పుడు వస్తానోఏమో! ఓసారి వెళ్తే సంతోషిస్తాడు అనిపించింది. రాత్రికి ఉండి పొద్దున్నే మళ్ళీ బస్సెక్కవచ్చు అనుకున్నాను. నెమిళ్ళపాడుదాకానే టికెట్టు తీసుకున్నాను.

బస్సు మొదటి స్టేజీలో ఆగింది. నలుగురు దిగి పదిమంది ఎక్కినట్లుంది. బస్సు కిటకిటలాడుతుంది. టికెట్.....టికెట్.... ఎక్కడిదాకా...? కండెక్టర్ పనిలో బిజీగా ఉన్నాడు.

ఊం...ఊం,.....చెప్పాలి....నువ్వు పెద్దమ్మా ఎక్కడికీ....అని ముసలమ్మను అడిగాడు. ఆమె చూసిందేగాని పలకలేదు. ఈసారి గట్టిగా అడిగాడు. నేను పెద్దామెకదా! చెవుడేమో అనుకున్నాను. కాని, ఆమె కోపంగా "డిల్లీకి వొకటియ్!" అంది.

చుట్టుపక్కలున్న వొకరిద్దరు కిసక్కున నవ్వారు. "నువ్వు డిల్లీకిపోతావేమోగాని ఈ బస్సు ఆత్మకూరుదాకే పోయేది......" అన్నాడు కండెక్టర్.

"డిల్లీకేనయ్యా!......మల్లా ఓట్లొస్తున్నాయంట.....ఈసారి డిల్లీకిపోయి ఓటేసి రావాలి......" సీరియస్‌గా ముఖం పెట్టి అంది.

కండెక్టర్‌కు చికాకు మాయమైంది. అందరితోపాటు ఆయనా గట్టిగా నవ్వాడు.

ఆ నవ్వుల్లోనే పక్కనేఉన్న ఆడామె "తిక్కది లేసారు! ఎప్పుడింతే. ఓట్లని డిల్లీ అయిదరా బాదు పోవాలని బజార్లు పట్టుకొని తిరుగు తుంటది" అన్నది.

కండెక్టర్ బస్సు ఆపమన్నట్లు విజల్‌వేసి, "డిల్లీకి తర్వాత పోదువుగాని ముందు బస్సు దిగు.....దిగు" అన్నాడు. ఇంతకుముందు చెప్పిన మనిషి, "తిక్కదానికేం తెలుస్తతది సారు......నెమిళ్ళపాడులో దిగుతాది ఒకటి కెట్టియ్యి......" అని, "టికెట్టుకు పైసలియ్యి లేకపోతే ఈడనే తోసేసి పోతారు....." అన్నది ముసలామెతో.

"పైసలా? ఎందికియాల్నే...ఈసారి ఓట్లలో అన్ని నేనే గుద్దుకోని మంతిరినై బస్సులన్నీ కొంటా...." అంది ముసలామె .

నాకు నవ్వొచ్చింది. బస్సు రోడ్డు మలుపు తిరగడంతో అంతదాకా ముసలామె మాటలు వింటూ పరధ్యాన్నంగా నిలబడ్డవారంతా ఒకరిపై వొకరు విరుచుకుపడ్డారు. వెనుక ఎవరో డ్రైవర్ సరిగా నడపడం లేదన్నారు.

యవమా(.......పైనలియ్యే తిక్క ముండా!.....అని ఆమె పిడికెటిలోంచి అయిదురూపాయలనోటు లాక్కొని కండెక్టర్ చేతిలో పెట్టింది ఆ మొదటి స్త్రీ.

రెండు నిమిషాలు మౌనంగా ఉండి, మళ్ళీ మాట్లాడ్డం మొదలుపెట్టిందామె. కాసేపు తనలో తను గొణుకున్నట్లుంటుంది. ఉన్నట్లుండి విరగబడి నవ్వుతూ గట్టిగా కేకలేసి అరుస్తుంది. ఎంతోసేపయినా ఓట్ల గురించిఎన్నికలగురించే!

కండెక్టర్ పక్కసీట్లో కూర్చున్నాయన భుజమ్మీద తట్టి, "ఈడేట వోట్లేసినా లాబం లేదయ్యా!.....అసలు ఈ నాకొడుకులు మనలను ఎయ్యనిస్తరా? అందుకే డిల్లీకి పోతున్నా. ఈ సారి రజీవుగాందో నేనో తేలిపోవా ల'న్నది.

ఎవరో కుర్రాడు మెట్లదగ్గర కడ్డీమీద కూర్చొని ఉన్నాడు. "అయితే రాజీవ్‌గాందీని ఓడగొడ్తవా?" అని అడిగాడు.

"అంతేమల....కత్తులు బాంబులు తీసకపోతే దెబ్బకుతేలిపోవాల. శేఖర్‌రెడ్డికి ఉచ్చబడాల....నాముందు రామారావయినా ఓడిపోవాల్సిందే! గారెంటీగ నేను గెలవా ల్సిందే....."అంటున్నది.

వొకరెంటవొకరు ఆమెతో ముచ్చటకు దిగారు.

అర్థంపర్థంలేని మాటలు పొంతనలే కుండా మాట్లాడుతుంది.

ఇదోరకం తిక్క అనుకున్నానేను. ప్రయా ణమంత అదే కాలక్షేపం.

మసక చీకటి పడ్తుండగా బస్సు నెవమీ ళ్లపాడు చేరుకుంది. "తిరిగి వచ్చేటప్పుడు బస్సు డిల్లీకిపోవాలి తెల్సిందా?" అని కండె క్టర్‌కు ఆర్డరేసి బస్సుదిగిందామె.

నేను దిగేసరికి అప్పటికే ఆమె అక్కడ లేదు.

ఆ విషయం అంతటితో వదిలేసి, శేషగిరి ఇంటికెలా వెళ్ళాలా? అని నాలుగడుగులు వేశాను. ఎదురుగా వస్తున్న పదిహేనేళ్ళ కుర్రాడిని అడిగాను. "ఓ......అల్లదిగో బోరింగ్ కనిపిస్తుంలా. ఆ సందులో పోయినావంటే మూడో ఇల్లే. శేషగిరన్న ఇంటి కాడనే ఉన్నట్లుంది......." అని వెళ్ళిపోయాడు.

బోరింగ్ దగ్గర సందులోకి వెళ్ళేసరికి ఎదురుగా వస్తూ కనిపించాడు. లుంగీ పైకి కట్టుకొని చేత ఏదో చిన్న డబ్బాతో వస్తున్నాడు. వంటిమీద బాగా మురికి పట్టిన కట్‌బనియన్ ఉంది. తలరేగి ఉంది. మోకాళ్ళదాకా మట్టి కొట్టుకొని దర్శనమిచ్చాడు. నేను దూరం నుండే కేకేసినట్లు పలకరించాను. నన్ను చూడగానే అతని ముఖం వెలిగిపోయింది. వచ్చి గట్టిగా చెయి పట్టుకున్నాడు.

"అబ్బ! ఎన్ని దినాలకు కనిపించావు" అన్నాడు.


నేను సమాధానంగా నవ్వాను.

పోదాంరా! అని ఆప్యాయంగా నా చేతిలో బ్యాగ్ తీసుకోబోయాడు.

నువ్వెక్కడికో వెళ్తున్నట్లుందే! అన్నాను.

ఇదా! అని డబ్బాచూపిస్తూ, గడ్డినూనెకని అంగడికిపోతున్నా......అన్నాడు. లోపల్నుంచి మంచం లాక్కొచ్చివేసి "కూర్చో, బావుండవా! ఇప్పుడు యాడున్నవ్....కుశలప్రశ్నలు వేశాడు. నేను క్లుప్తంగా వివరాలు చెప్పేశాను.

చీకటి బాగా అలుముకుంది. ఇంట్లోగాని



బైటగాని వెల్తుర్లేదు. శేషగిరి ఇబ్బందిగా కదిలాడు. 'ఇప్పుడేవస్తా' అని పక్కింట్లో దీపం సీసా తీసుకొచ్చి వెలిగించాడు. అది దట్టమైన పొగతో వాసనతో ఎరుపుగా వెలుగుతోంది. అతను ఏవేవో అడుగుతున్నాడు. నేను మనస్ఫూర్తిగా సమాధానాలు చెప్పలేకపోతు న్నాను. వేరే ఆలోచనలేవో ఆవురించాయి. ఇప్పుడు శేషగిరి ఉన్నస్థితి నాకు అర్థం కావడం లేదు. ఇంట్లో ఎవరూ ఉన్నట్లులేదే! అన్నాను. దానికి నవ్వాడు. ఆ నవ్వు నాకు బోధపడ్లేదు. 'ఎవరూ లేరు వొక్కన్నే' తనే చెప్పాడు. నాకెందుకో సహజంగా అనిపించలేదు. అలాంటప్పుడు నా మనసు స్థిమితంగా ఉండలేదు. అయినా నెమ్మదిగా వివరాలు రాబట్టవచ్చులే అని అప్పటికి వదిలేసాను. దేనికంటే మా పరిచయంలో శేషగిరి నాదగ్గర ఏదీ దాచడని తెలుసు.

చల్లగా గాలి వస్తుంది. ప్రయాణ బడలి కవలన హాయిగా తోచింది. పదినిమిషాల య్యాక లేచి కాళ్ళూ చేతులు కడక్కొ చ్చుకున్నాడు. నన్ను స్నానం చేయమన్నాడు. నేను ముఖం కడుక్కొని సరిపెట్టుకున్నాను.

"లోపలికొచ్చి నువ్వట్లా మంచమ్మీద కూర్చొని చూస్తుండు - పదినిమిషాల్లో అన్నం కూరజేస్తా......" అన్నాడు.

పొయి ముందు కూర్చొని పుల్లా పుడకవేసి రాజేశాడు. గిన్నెలు ఎక్కించాడు. నేను ఎదురుగా కూర్చొన్నాను. నాలుగేళ్ళ కిందటి ముచ్చట్లు ఏ కరువు పెట్టుకుంటున్నాం. ఇద్దరికీ మధ్య ఎత్తుమీద దీపం వెలుగుతోంది. ఇంతలో బైట ఎవరో వచ్చినట్లు అలికిడైంది. తలెత్తి చూశాను. వాకిట్లో ఒక స్త్రీ నిలబడి ఉంది. పరిశీలనగా చూశాను. ఆమే....! ఇందాక బస్సులో ఓట్లని రాజకీయాలు ఉన్మాదంగా మాట్లాడినామె. ఏదో తనలోతను గొణుక్కుంటూ నిల్చుంది. 'అరే! ఈమె ఇక్కడికీ వచ్చిందే!' అనుకొని, పైకి

అనబోయాను. నేనేమాత్రం ఊహించని విధంగా "మాఅమ్మ "అని చెప్పాడు శేషగిరి.

"మీ అమ్మ"'అన్నాను. అప్పుడు ఆశ్చర్యమో ఇంకేమోదాని నాగొంతు నాకే కొత్తనిపించింది. దేనికంటే ఇలాంటి సంఘటన నాకింతవరకు ఎదురు కాలేదు.

బస్సులో కూర్చున్నంతసేపూ ఎవరో పిచ్చిమనిసి అనుకున్నానేగాని, ఇలా.......

"అవును"

"మరి ఇందాక నేవచ్చిన బస్సులోనే వచ్చింది. ప్రయాణమంత ఓట్లు"....."కర్నూలు పక్కన లింగాపురంలో మా అక్క ఉంది. ఆడబస్సెక్కి ఉంటది. .....క్షణంసేపాగి.... మూడేళ్ళనుంచి ఇట్లే తయారైంది........."

శేషగిరి ఎండుకంపపుల్ల మధ్యకు విరిచి పొయిలో వేశాడు. ఆయన గుండెలోని 'సెగ' నా ముఖాన్ని సోకింది.

ఏదో అనబోయి కూడా అప్పటికే ఊరుకుండిపోయాను.

ఆమె వాకిట్లోంచి బైటికి దారితీసింది. 'బువ్వతినిపోదువుండు..."అన్నాడు శేషగిరి. "నాకు ఊళ్ళో పనుంది పోవాల......" అని వెనక్కి తిరిగి చూడకుండానే వెళ్ళిపోయింది.

వంట పూర్తయ్యేదాకా నేను సరిగా మాట్లాడలేకపోయాను.

మనసులో రొదమొదలైంది.

శేషగిరి నా పరిస్థితి గమనించాడు. నా మూడ్ మార్చాలని నానా ప్రయత్నాలు చేశాడు. భోజనం చేస్తున్నంతసేపు వాతావరణం సరదాగా ఉండాలని ఏవేవో మాట్లాడాడు.

చెయి కడుక్కొని చెప్పులేసుకుంటుంటే, ఎక్కడికీ? అనడిగాను. ఇప్పుడేవస్తా!నని వెళ్లి అయిదునిమిషాలకంత వచ్చేశాడు. నేను అడక్కుండానే 'యాడికిపోయిందో ఏమో! కాన్రాలే.......' అన్నాడు.

నేను అర్థం చేసుకొన్నాను "మరి రాత్రికి భోజనం....?"

"ఇంక అంతే....! ఇట్ల ఎన్నిరోజులైందో......"

ఇద్దరం మౌనంగా బైటికొచ్చి చెట్టు మంచంలో కూర్చున్నాం. శుక్లపక్షమేమో వెన్నెలకాస్తుంది. కాసేపు ఆకాశంకేసి, వీధిలోకేసి చూసి ఇక ఉండబట్టలేక "అమ్మకేమైంది? నాన్న......?" అనడిగాను.

శేషగిరి తలొంచుకొని కాళ్ళకేసి చూసుకుంటున్నాడు. తలెత్తలేదు. నేను కొన్ని క్షణాలు ఎదురు చూడవలసి వచ్చింది.

"నాయన్ను చంపినారు....అస్నుండి



అమ్మకు తిక్కచేసి తిరుగుతుంది"

నేను అదిరిపడ్డాను "చంపేశారా? ఎవరు?....ఎందుకని...." నాకు తెలిసినంత వరకు శేషగిరి కుటుంబానికి ఎలాంటి గొడవల్తో సంబంధం లేదు. శేషగిరి ఎంత మెతకనో వాళ్ళనాయన అంతకన్నా నిదానస్తుడు. పార్టీలకు కొట్లాటలకు ఆమడదూరం ఉంటాడని శేషగిరే ఎప్పుడన్న ప్రస్తావన వచ్చినపుడు అనేవాడు. వాళ్లమ్మనా అసలు నోట్లో నాలుక ఉందని చాలా మందిలాంటి స్త్రీ. మరి అట్లాంటివాణ్ణి ఎందుకు చంపేశారు?

"పోయినసారి పార్లమెంటు ఎన్నికలప్పుడు ......''మాట తెగిపోతూ వచ్చింది. నాకైతే మరి మాటలు దొరకలేదు. కొన్ని సెకెన్ల తర్వాత.... "మా నాయిన అదో రకం మనిషి. పదిమందిలోపడిగడిచిడ తిరిగేటోడుకాదు. తనపని....తనలోకం. అది మంచో చెడ్డోగాని, ఊరయితే అట్లాలేదు. మా నాయనకు రాజకీయాలంటే పడదు. కొట్లాటలంటే అసయం. కాని ఊర్లో రాజకీయాలు లేనోడు లేరు. ఏదోవొకవైపు ఉండాల. అట్లున్నా దినదినగండమే! ఇంక ఏ వైపు లేనోళ్ళను బతకనిస్తారా? పెద్ద దయిర్యస్తుడుగాకపోయినా రెడ్ల మాట లెక్కబెట్టినోడు కాదు. ఎదిరిద్దామనికాదు. ఆయన తీరే అంత.....తన ఇష్టమొచ్చినవాళ్ళకు ఓటేస్తాడు. వొకరిమాట వినడు.

....ఎలక్షన్లరోజు పదకొండు గంటలప్పుడు బువ్వతిని ఓటెయ్యనక బైటికొచ్చినాడు. నన్నుకూడ రమ్మంటే "నేనే ఓటెయ్యను. ఎవడు గెలిచినా మన నెత్తిన ఒరిగేదేముంద'ని పోలేదు. అమ్మకూడ అదేమాటంది. ఈన ఓటెయ్యడానికి లోనికిపోయేసరికి, ఆడ శేఖర్రెడ్డి పది మందితో కుర్చీలో కూర్చునున్నాడంట. మిగతావాళ్ళు పోలీసులు. వరసపెట్టి ఓట్లు గుద్దుకుంటున్నారంట. మా నాయన గమ్మున తిరిగి రావల్సినోడే! అట్లోచ్చి ఉంటే బావుండేది. ఏ శని నాలికమీద కుర్చోనుందోగాని 'నేను వోటెయ్యాల.....' అన్నాడంట ఆడున్న ఆఫీసరుతో. ఆ సంగతి శేకర్రెడ్డికి తెలిసింది. దాంతో చిచ్చురాజుకుంది. 'నీవోటు ఎవరో వేసినార'ని ఆ ఆఫీసరు చెప్పినాడు. అయినా ఈన కదల్లేదు. శేఖర్రెడ్డి మనిషొచ్చి మా నాయన్ను బైటికి తోసినాడు. రోసమొచ్చింది. బదులు తిట్టినాడు. వాడొచ్చి మీదపడి కొట్టినాడంట. మా నాయనకు అభిమానం ఎక్కువ. కోపంతో ఏమో అన్నడంట.

అదీగాక మూడు రోజుల ముందు రామిరెడ్డి మనుషులు ఓటెయ్యమని అడిగితే, అప్పటికి 'మీకేవేస్తాన'ని అన్నాడు. అసలు మొదట్నుంచి శేఖర్రెడ్డి గుంపంటే మా నాయనకు మంట. ఇన్నేళ్ళనుండి ఒక్కసారైనా వాళ్ళ కాడికాబోయినోడు కాదు. కులపోల్లందరితోపాటు వాళ్ళకింద నడిచేవాడు కాదు. శేఖర్రెడ్డి ఇది కూడ మదిల పెట్టుకొన్నడేమో మరి.

ఆడికి చాలదన్నట్లు ఈన తిట్టుకుంటా ఇంటికొస్తుంటే, దార్లో రామిరెడ్డి మనుషులు కనబడి బలవంతంగా లాక్కుపోయి గంటలకొద్దీ మంతనాలు చేసినారు. శేఖర్రెడ్డిని అదిచెయ్యాల ఇది చెయ్యాలని ఎక్కించినారు. మా నాయన పలక్కుండా తిరిగివచ్చేశాడు.

ఈ సంగతి శేఖర్రెడ్డికి తెలిసింది.

ఇంతచేసినా, ఊళ్ళశేఖరరెడ్డి వైపు తక్కువ వోట్లు పడినాయంట.

రామిరెడ్డి మనుషులు మళ్ళీ నాయకత మాట్లాడినారు.

మూడోరోజు పొద్దున్నే చెంబుపట్టుకొని పోతుంటే రోడు పక్కనుండే చేలగట్లల్లో బాంబువేసినారు. ఆడికాడనే ఊపిరిపోయింది. మా మీద పగో. రామిరెడ్డి మీద పగోగాని మా

ఇల్లు నాశనం చేసినారు. .....

......ఆడినుండి మాయమ్మ ఇట్ల తయారైంది. మొదట ఇంత ఉండేది కాదు.

ఒకరోజు శేఖరరెడ్డిఇంటిమీదికిపోయింది. నోటికొచ్చినట్లు తిట్టి దుమ్మెత్తి పోసింది. బజార్లెంట వాన్ని చంపుతానని తిరగడం మొదలుపెట్టింది. దాంతో తిక్కది - ఆడమనిషి అని కూడ చూడకుండా కొట్టించినాడు. అప్పటి నుండి పూర్తిఎక్కువైంది......"

శేషగిరికి దుఃఖం తన్నుకొచ్చింది.

వెన్నెల వెల్తుర్లో ముఖంకేసి చూశాను. ఆ దృశ్యాలు కనిపించినట్లె కలవర పడ్డాను.

"......బజార్లెంట ఊరకట్లా తిరుగుతా ఉంటది. తిండితినాలనుకోదు. ఈడ ఉండబుద్ధి కాకుంటే అయిదురూపాయలు ఇప్పించుకొని అక్కదగ్గరికిపోతది. ఈ రెండూళ్ళ మధ్యనే."

నాకింకేమనాలో తోచలేదు. 'కేసునడవలేదా' అనబోయి. అంతవిని ఈ ప్రశ్న వేయడం దేనికని మానుకున్నాను. ఇక్కడ పద్ధతి ప్రకారం ఏవీ లేనప్పుడు కేసులు మాత్రం ఎందుకు నడుస్తాయి. రెండునిమిషాల మౌనం తర్వాత "మరి వొంటరిగా ఇక్కడే ఉండి ఈ బాధలో మునిగి తేలేకంటే బైటికొచ్చి ఏ చిన్న ఉద్యోగం చూసుకున్న బాగుంటుందేమో కదా?" అన్నాను.




ఉద్యోగమేం వస్తుంది? ఏ చిన్నదో వస్తే కూడ అర్థాకలేకదా? దానికంటే ఉన్న మూడెకరాలు చూసుకుంటూ ఈడనే పడుంటే మేలు. ఊరు దాటాలంటే ముందు నాయన చేసిన అప్పులు చెల్లించాల. అదనాక, ఏటౌనుకు పోదామన్న ఈ తిక్కదాన్నేం చేయాల? యాడన్న ఇమిడేటట్లున్నది? పోనీ ఆమె అదృష్టానికి ఆమెను వదిలేసి పోదామంటే చదువుకోవడంవల్ల వచ్చిన సంస్కారం వొప్పుకోవడంలేదు. ఇంక ఆమె అంతే..... నేనింతే...."

ఆ పరిసరాల్లో పెరిగినవాణ్ణి కాబట్టి, అడపాదడపా ఇలాంటివి పేపర్లలో చూశానంతే కాని ఇలా మనకు దగ్గరైనవాడికి, , ఆత్మీయుడికి జరగడంతో మునుపెన్నడూ నేను అనుభవించని బాధతో ప్రాణం విలవిల్లాడింది. చాలా కాలం తర్వాత శేషగిరిని పలకరిద్దామని ఎంత ఆశతో వచ్చాను! కాని, ఇక్కడెన్నో చిగురుటాకులు శిధిలాలై ఏడుస్తున్నట్లనిపించింది. విషపు కత్తుల నడుమ ఊపిరి వొరుసుకపోతున్నట్లనిపించింది. ఇక్కడ జీవితానికి మరణానికీ మధ్య ఏ దుర్మార్గ క్షణమైనా బొత్తిగా హద్దులు లేకుండా చెరిపేయవచ్చు. ఇది స్వేచ్ఛగా గాలి పారాడని సీమ......

'జీవితాంతం ఇలాగే ఉండదని నామాటగా కష్టాల్లో రాటుదేలిన శేషగిరికి చెప్పి, ఆయన్ని వదిలేసి ఆయన కన్నీటిని మోసుకొని మర్నాటి మధ్యాన్నం బస్సెక్కాను.

★

## గీతాగోవిందం — AVM

